క్లుప్తంగా

50 మందికి కంటి పరీక్షలు

నందిగామటౌన్: భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని భగవాన్ సత్యసాయి మందిరంలో శంకర్ కంటి ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు సత్యసాయి సేవా సమితి సభ్యులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తురోజు శ్రీనివాసాచారి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



పెద్దాపురం(వీరులపాడు): నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ అనిల్ హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామశివారులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా సహించేది లేదన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలకు తప్పకుండా పాటించాలన్నారు. వాహనాలను నడిపేసమయంలో తగిన ధ్రువీకరణపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలను పాటించని పలువురు వాహన చోదకులకు జరిమానా విధించారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.జాహ్నవి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

ఓటు నమోదు చేసుకోవాలి

కంచికచర్ల: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్లు, పెన్షనర్లు ఈనెల ఆరోతేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని రిటైర్డు ఉద్యోగులసంఘం అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలోని గ్రాడ్యుయేట్లు, ప్రభుత్వ పెన్షనర్లు తప్పకుండా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారాలు పెన్షనర్స్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ నంబర్, ఓటరు కార్డు జిరాక్సు కాపీలపై గజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి ఈనెల ఆరోతేదీలోగా మండల రెవెన్యూ అధికారికి అందజేయాలని సూచించారు. గతంలోని ఓటరు లిస్టు పరిగణలోకి తీసుకోనందున, అందరూ తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలోని పేట పట్టణంతోపాటు చిల్లకల్లు, పెనుగంచిప్రోలు, వత్సవాయి పోలీస్ స్టేషన్లలో పరిధిలోని రౌడీషీట్ నమోదైనవారికి ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ పోలాకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సత్ప్రవర్తన కలిగి, పనులు చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉండాలని సూచించారు. చట్టాలను అతిక్రమించి నేరాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. పట్టణ ఎస్ఐ జి.రాజు, ఎస్ఐ-2 వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు



జగ్గయ్యపేట అర్బన్: కార్తికమాస ఆదివారం సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక శ్రీచంద్రమౌళీశ్వర స్వామి ఆలయం(పెద్దశివాలయం), మఠం శివాలయం, శ్రీమహాలక్ష్మిఅమ్మవారి వెండిదేవాలయం, నకాశిబ జారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, విజయవాడ రోడ్‌లోని శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం, దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు.



శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆలయంలో కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు

ప్రత్యేకాలంకరణలో

దర్శనమిచ్చిన అమ్మవారు

కార్తికమాస ప్రత్యేక అలంకరణల్లో భాగంగా పెనుగంచిప్రోలు శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు ఆదివారం వివిధరకాల పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్తికమాసం, సెలవుదినం కావడంతో భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివార్లను ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో భూపతిరాజు వెంకట సత్య నాగకిషోర్‌కుమార్, ఏఈఓ ఉమాపతి, తిరుమలేశ్వరరావు దర్శించుకుని పూజలు చేశారు. స్వామివార్ల పూల అలంకరణకు విజయవాడకు చెందిన దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, కల్పన దంపతులు సహకారం అందజేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. – పెనుగంచిప్రోలు



అమ్మవారికి బోనాలు తెస్తున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు

రేషన్ వాహనాలు కొనసాగేనా?

- వాహనాల కొనసాగింపుపై కొరవడిన స్పష్టత
- ఆందోళనలో కార్డుదారులు, ఎండీయూ వాహనాల నిర్వాహకులు



గండేపల్లిలో రాత్రి సమయంలో కూడా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం నిర్వాహకులు

కంచికచర్ల: రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలు(ఎండీయూ) కొనసాగింపు విషయంలో కూటమి ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడంపై ఎండీయూ వాహన నిర్వాహకులంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చిన వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటినీ లబ్ధిదారులకు వారి ఇళ్లవద్దనే అందజేసింది. ముఖ్యంగా రేషన్‌కార్డుదారులు ఇబ్బందులు పడకుండా మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందజేయడంతో కార్డుదారులు రోజంతా రేషన్‌షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి దుస్థితి తప్పింది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు మేలు చేకూరింది. కూలీలు తమ పనులు మానుకోవాల్సిన అవసరం లేకుండా రేషన్‌సరుకులు అందాయి. అయితే ఈ ఎండీయూ వాహనాలకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మంగళం పాడేందుకు సిద్ధమైందని ప్రచారం సాగుతుండటంతో అటు కార్డుదారులు, ఇటు ఎండీయూ వాహనాల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు.

107వాహనాల ద్వారా సరుకుల పంపిణీ..

నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల మండలంలో 23,368 రేషన్‌కార్డులు ఉండగా, చందర్లపాడు మండలంలో 21,052కార్డులు, నందిగామ మండలంలో 28,099కార్డులు, వీరులపాడు మండలంలో 17,384కార్డులు, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట పట్టణం, మండలంలో కలిపి 36,717 రేషన్‌కార్డులు ఉన్నాయి. పెనుగంచిప్రోలు మండలంలో 17,823కార్డులు, వత్సవాయి మండలంలో 20,812 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 1,65,255 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ రేషన్‌కార్డుదారులందరికీ 107 ఎండీయూ వాహనాల నిర్వాహకులు ప్రతినెలా రేషన్ సరుకులు అందజేస్తున్నారు.

కూటమి నేతల మేలు కోసమేనా?..

ఎండీయూ వాహనాల తొలగింపు ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కార్యకర్తలను రేషన్ డీలర్లుగా నియమించి వారికి లబ్ధిచేకూర్చాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఇటువంటి ఆలోచన చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఎండీయూ వాహనాలను పక్కన పెట్టేందుకు సిద్ధమైందని ఆయా వాహనాల నిర్వాహకులు అనుమానిస్తున్నారు. అదే జరిగితే రేషన్ దుకాణాల వద్ద మళ్లీ రోజుల తరబడి క్యూకట్టక తప్పదేమోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

నిర్వీర్యం దిశగా ప్రభుత్వం అడుగులు....

ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ సరుకులు అందించటం ద్వారా దివ్యాంగులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని, రేషన్ సరుకుల కోసం ఎవ్వరూ పనులు మానుకోవాల్సిన అవసరం ఉండదని గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. 2021 నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ప్రజాపంపిణీలో నవశకానికి నాంది పలికారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఈ–పోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో పంపిణీ చేసింది. రేషన్ పంపిణీని సెంట్రల్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయడంతో ఈ పథకం పకడ్బందీగా నడిచింది. రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా ఎండీయూలకు సరుకులను సరఫరా చేసే బాధ్యతలను ఆయా డీలర్లకు అప్పగించారు. దీంతో యువతకు ఉపాధి లభించింది. ప్రజలకు నేరుగా ఇంటికే రేషన్ సరుకులు అందాయి. డీలర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. పేదల ఇంటిముంగిటనే రేషన్‌సరుకులు అందించడం..నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఈ పథకం నాలుగేళ్లుగా దిగ్విజయంగా సాగుతోంది. కాని చంద్రబాబు ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీని నిలుపుదల చేస్తే మళ్లీ ఐదేళ్ల కిందటి మాదిరే ఇబ్బందులు తప్పేలా లేవని కార్డుదారులు వాపోతున్నారు.

మరో నాలుగేళ్ల వరకు ఒప్పందం..

ఇంటింటికి రేషన్ సరుకులు పంపిణీలో భాగంగా ఎండీయూలకు 2027 వరకు ఒప్పందం ఉంది. వాహనాల వాయిదాల సైతం అప్పటి వరకు చెల్లించాల్సి ఉంది. ఎండీయూ వాహనం ధర రూ.5.80లక్షలు కాగా అందులో 10శాతం లబ్ధిదారులు చెల్లించారు. మిగిలిన నగదు ప్రభుత్వం చెల్లించింది. ఎండీయూ నిర్వాహకుడు నెలకు రూ. 3వేలు చెల్లిస్తుండగా మిగిలిన రూ.8వేలు ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తోంది. ఈ పథకాన్ని రద్దు చేస్తే ఈ ఒప్పందం మాటేమిటని ప్రశ్నిస్తున్నారు. తమ ఉపాధిని దెబ్బతీసి, మా కుటుంబాలను రోడ్డున పడేయవద్దని ఎండీయూ వాహనాల నిర్వాహకులు వేడుకుంటుండగా, రేషన్ సరుకులను యథావిధిగా అందజేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

ఈ పద్ధతే కొనసాగించాలి..



మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఇంటివద్దకే రేషన్ బియ్యం పథకాన్ని కొనసాగించాలి. ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ బియ్యాన్ని అందచేయాలి. ఈ వాహనాలను తీసివేస్తే రేషన్‌షాపునకు వెళ్లేందుకు వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడతారు. ప్రభుత్వం ఆలోచించి వాహనాలను కొనసాగించాలి.

– ముప్పాళ్ల సత్యనారాయణ, కొత్తపేట, కంచికచర్ల మండలం

కార్డుదారులకు ఎంతో మేలు..



రేషన్ సరుకులను ఇంటివద్దకే అందజేయాలి. రేషన్ దుకాణాల వద్ద సరుకులు ఇస్తే గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వచ్చేది. ఒక్కోసారి కూలిపనులు కూడా మానుకోవాల్సిన దుస్థితి. వాహనాలు ఇంటివద్దనే సరుకులు ఇస్తుండటంతో కార్డుదారులకు ఎంతో మేలు చేకూరుతోంది. వాహనాల డ్రైవర్లకు ఉపాధి లభిస్తుంది.

– మార్కపూడి ఏసుపాదం, గండేపల్లి

నేడు ఏకాదశ రుద్రాభిషేకం

ముక్త్యాల(జగ్గయ్యపేట): కార్తికమాస మొదటి సోమవారం సందర్భంగా కోటిలింగ హరిహర మహాక్షేత్రంలోని కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈవో హరిదుర్గానాగేశ్వరరావు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈవో కోరారు.

మరమ్మతులకు నోచుకోని 108అంబులెన్స్



వీరులపాడు: ఆపదలో ఉన్న ఎందరినో సకాలంలో ఆస్పత్రులకు చేర్చి వారి ప్రాణాలను కాపాడిన 108 అంబులెన్స్ మరమ్మతులకు గురై కొన్ని నెలలుగా నిరుపయోగంగా మారింది. కరోనా మహమ్మారి జూలు విదిల్చినా నేనున్నానంటూ సేవలందించిన 108 అంబులెన్స్‌కు నుస్తే చేస్తే పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో ప్రమాద ఘటనలు, అత్యవసర వేళల్లో అంబులెన్స్ సదుపాయం లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సకాలంలో వాహనసదుపాయం లేక అవస్థలుపడుతున్నారు. జుజ్జూరులోని రోడ్డుపక్కన కొన్నినెలలుగా నిరుపయోగంగా పడిఉన్న ఈ 108 అంబులెన్స్ పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని మండల ప్రజలు విమర్శిస్తున్నారు.ఇకనైనా అధికారులు స్పందించి 108 అంబులెన్స్‌ను వినియోగంలోకి తెచ్చేలా మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నాడు కళకళ-నేడు వెలవెల

- నియోజకవర్గంలో సచివాలయాల పరిస్థితి
- సచివాలయాల నిర్వీర్యం దిశగా కూటమి ప్రభుత్వం
- నాడు హేళన చేసిన సచివాలయ ఉద్యోగులతోనే నేడు పింఛన్ల పంపిణీ



ముక్కపేటలోని గ్రామ సచివాలయం

వత్సవాయి: గత ఐదునెలల కిందటి వరకు ఆయా పథకాల లబ్ధిదారులు ప్రజలతో కళకళలాడిన వార్డు, గ్రామ సచివాలయాలు...నేడు వెలవెలబోతున్నాయి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేలా ఏర్పాటైన సచివాలయాలు నేడు క్రమేపీ అలంకార ప్రాయంగా మారే దుస్థితికి చేరాయి. వత్సవాయి మండలంలో 19గ్రామసచివాలయాలు ఉండగా, పెనుగంచిప్రోలులో 15, జగ్గయ్యపేట మండలంలో 19, జగ్గయ్యపేట పట్టణంలో 14వార్డు సచివాలయాలు కలిపి నియోజకవర్గంలో మొత్తం 67 సచివాలయాలు ఉండగా మొత్తం 603 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

గతంలో సచివాలయాల్లో 500పైగా సేవలు..

గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సుమారు 500కు పైగా సేవలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ఆయా సేవలు కనుమరుగయ్యాయి. పథకాలు సంబంధించి సర్వర్లు పనిచేయడం లేదు. ముఖ్యంగా రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు, కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ఆయా సర్వర్లు ఓపెన్ గాక పేదలు అవస్థలుపడుతున్నారు. గతంలో ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణపత్రాలను వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు వారి ఇళ్లవద్దనే అందించిన రోజులను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. మళ్లీ ఆయా పథకాలు తిరిగి ఎప్పట్నుంచి అందుతాయోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

సర్వర్లు పనిచేయవు..పథకాలు లేవు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ఐదునెలలుగా పింఛన్ పథకాన్ని మాత్రమే కొనసాగిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వహయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతుభరోసా, అమ్మఒడి, విద్యాదీవెన, మత్స్యకార భరోసా తదితర పథకాలన్నింటినీ కూటమి ప్రభుత్వం నిలుపుదల చేసింది. వలంటీర్ వ్యవస్థను సైతం పక్కనపెట్టింది. నాడు ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకునే పేదలు, లబ్ధిదారులతోపాటు, వలంటీర్లతో కళకళలాడే సచివాలయాలు నేడు సందర్శకులు లేక వెలవెలబోతున్నాయి.

పింఛన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులే దిక్కు..

గతంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ పార్టీ అధినేత నుంచి కిందస్థాయి నాయకుల వరకు ప్రతిఒక్కరూ సచివాలయ వ్యవస్థ, ఉద్యోగులపై విమర్శలు చేశారు. సచివాలయ వ్యవస్థ ఎందుకు, అసలు అవి ఉద్యోగాలే కాదు అంటూ హేళన చేసి మాట్లాడారు. కానీ ఇప్పుడు సచివాలయ ఉద్యోగులే కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. గతంలో ప్రతినెలా ఒకటో తేదీనే సూర్యోదయానికి ముందే వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి ఠంచన్‌గా పింఛన్ నగదు అందజేసేవారు. దీంతో వృద్ధులు, వికలాంగులకు ఎంతో మేలు చేకూరింది. అప్పట్లో వలంటీర్, సచివాలయ వ్యవస్థను తూలనాడిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక అదే సచివాలయ ఉద్యోగులతో కలసి ఇంటింటికీ వెళ్లి సచివాలయ ఉద్యోగుల చేత 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ స్టిక్కర్లు అతికించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయగా, ఆయా పథకాలను నిలుపుదల చేసి ఆర్థికంగా తమకు తీరని అన్యాయం చేస్తున్నందున 'ఇది మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వం' అని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఆయా సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి సర్వర్లు ఓపెన్ అయితేనే సచివాలయాలు తిరిగి జనంతో కళకళలాడుతాయని పలుచోట్ల సచివాలయ ఉద్యోగులు సైతం చర్చించుకుంటుండటం గమనార్హం.

రోడ్డుకు మరమ్మతులు



గుంతలు పూడ్చుతున్న జేసీబీ

నందిగామటౌన్: మండలంలోని కూడలి దాములూరు రహదారి ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు కోట్టుకుపోవడంతో రహదారిపై రాకపోకలు సాగించేందుకు, సమీప గ్రామాల ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతూ నందిగామ, జగ్గయ్యపేట ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్‌కు వినతిపత్రం అందించినా కోరినా ఫలితం లేకపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్తికమాసం ప్రారంభం కావడంతో గ్రామంలో వేంచేసియున్న సంగమేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో ప్రమాదాలు తప్పేలా లేవని వాహనదారులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో గ్రామానికి చెందిన నాయకులు నెల్లూరి గోపీనాద్, సాదం హనుమంతరావు సొంతఖర్చుతో గుంతలు పూడ్చించే పనులు చేపట్టారు. జేసీబీ సాయంతో గుంతలు పూడ్చి రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నారు.

ఘనంగా కార్తిక వన సమారాధన



కార్తిక వన సమారాధన పూజలు చేస్తున్న గాయత్రి బ్రాహ్మణ సంఘు సభ్యులు

నందిగామటౌన్: కార్తిక మాసం ప్రారంభంకావడంతో కార్తిక వన సమారాధనలతో పట్టణ సమీపంలోని మునేటి ఒడ్డునున్న మామిడి తోటలు కళకళలాడుతున్నాయి. గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద మంత్రోచ్ఛరణల నడుమ ఉసిరిచెట్టు, శ్రీమహావిష్ణువుకు ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక సత్యనారాయణ స్వామివారి వ్రతం నిర్వహించి పాలపొంగళ్లు సమర్పించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. యాంత్రిక జీవనంలో కార్తిక వన సమారాధన కార్యక్రమాలతో మనస్సుకు ప్రశాంతత కలుగుతుందని బ్రాహ్మణసంఘ సభ్యులు పేర్కొన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరు ఆటపాటలతో సందడి చేశారు.